# ఆనవాయితీ




"ఆడపిల్ల తొలి కాన్పు చేయాల్సింది పుట్టింటోళ్ళు. మాకేంబట్టింది''పదోసారి అంది కామాక్షమ్మ.

''నిజమే కావమ్మొదినా ! నేను కాదనడం లేదు. వుంటే బిడ్డకు పురుడు పోసుకునేది – మాకు కష్టమా ?''

''వుంటే. వుంటే, వుంటే అంటావే ఎంతసేపటికీ – ఆడపిల్లకు పెళ్ళిచేసాక కడుపొస్తుందని తెలీదూ ? కాన్పు సమయానికి డబ్బు దాచుకోవాలని తెలీదూ ?''

''వీలుంటే కడుపుకట్టుకొన్నైనా దాచుకోక పోయానా ?'' అని మనసులోనే గొణుక్కుని మరలా ప్రాధేయపడసాగింది సరోజనమ్మ.

''ఏం చేయను చెప్పు వదినా నీకు తెలియందేవుంది? వాడుచేసేది గుడ్డలంగడిలో రెండొందల గుమస్తా ఉద్యోగం – బిడ్డ అడ్డంగా వుందనీ, ఆపరేషన్ కావ్వొచ్చనీ తెలిస్తే నలుగురేమను కున్నాసరే నాలుగిళ్ళల్లో పాచి పని చేసయినా దాచుకుందును. ఇప్పుడయినా మించిపోయింది లేదు. నువ్విప్పుడు ఖర్చుపెట్టే డబ్బు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను. అది నీ బిడ్డే అనుకో. నీ కడుపులో పెట్టుకో ఇవి చేతులు కావనుకో.''

''నా బిడ్డే అనుకోవాలా ? ఇది మరీ బాగుంది. బిడ్డల్ని కనగానే సరికాదమ్మా వాళ్ళకు పెళ్ళిళ్ళు, పురుళ్ళు చేసుకోవాలి.''

''చేసుకోవాలమ్మా నేను కాదంటానా ? డబ్బు లేకగానీ...''

కామాక్షమ్మకు చాలా కోపం వస్తోంది. పిల్లకు పురుడు చేసుకోను డబ్బు లేదంటుందే. ఆమాత్రం తెలీదూ పుట్టింటోళ్ళ పురుడు పోయాలని.

''కావమ్మ వదినా ! యీసారికి మల్లికి మీరే పురుడుపోసి పుణ్యం కట్టుకోండి ఆ తర్వాత మా పరిస్థితి మెరుగయితే మిగతా కాన్పులన్నీ మేమే చేస్తాం. నీ కాళ్ళు పట్టుకుంటాను వదినా !''

వియ్యపురాలి చేతులు విసిరి కొట్టింది కామాక్షమ్మ.

''భలే కిలాడిదానివే నువ్వు. నన్ను ఉబ్బించి బుట్టలో వేసుకోవాలని చూస్తున్నావా ? ఈ ఆటలన్నీ నా దగ్గరసాగవు. పురుడే పోసుకుంటావో, బావిలోకే తోస్తావో నీ ఇష్టం. నీ పిల్లను నువ్వు తీసికెళ్ళిపో.''

''నీ కొడుక్కి సర్వ సౌఖ్యాలు ఇస్తూ నీ ఇంటికి సర్వ చాకిరీ చేస్తున్న నా కూతురు నీ కేమీ కాదా ?– నా చేతిలో డబ్బు లేనప్పుడు నీ చేతిలో డబ్బున్నప్పుడు, దాని ప్రాణం మీదికి వస్తే నీ కొడుకు భార్య ప్రాణాల్ని నిలుపుకోవాల్సిన కనీస బాధ్యత నీకు లేదా? అదే అల్లుణ్ణయితే పారేసుకుంటావా ? నీ కూతురి పసుపు–కుంకుమల కొరకు. నీ చేతిలో డబ్బు ఖర్చుపెట్టి బాగుచేయించుకోవూ ?'' అని అడగలేదు జయమ్మ. అసలలా అడగాలనే ఊహే రాలేదామెకు.

''నిజమే. మొదటి కాన్పు పుట్టింటోళ్ళు చేయాల్సిందే. కానీ ఎలా ?'' అని దిగులుపడి మనసును కాల్చుకుంటోంది.

''చూడు వదినా ! నా ఒంటి మీద కానీ, కోడలి వంటి మీద గానీ పిసరంత బంగారున్నా అమ్మి దాని కాన్పు చేద్దును. కానీ నీకు తెలీందేముంది చెప్పు.''

విసురుగా ముఖం తిప్పుకుంది కామాక్షమ్మ.

''వదినా !''

విసుగ్గా చూసి ఉచిత సలహా ఇచ్చింది కామాక్షమ్మ.

''నీ కోడలు కూడా ఎనిమిదవ నెలను కుంటాను. కడుపు సారె తేవాలిగా. దాని బదులు డబ్బిమను'' వియ్యంకురాలి సలహా విని నిట్టూర్చింది జయమ్మ.

''వాళ్ళు మా కంటె గర్భదరిద్రులు. వాళ్ళేం పెడ్తారు ? అడగడం నోరు నొప్పి కానీ–పురుడు కూడా మమ్మల్నే పోసుకోమంటారో ఏమో !''

తమాషా ఏమంటే ఇప్పుడు వియ్యంకురాల్ని తన కూతురి కాన్పు చేయమని ప్రాధేయపడుతున్న జయమ్మ తన కోడలి పుట్టింటి దరిద్రం తెలిసినాకూడా వాళ్ళే యీ కాన్పు చేయాల్సింది అనే భావాన్ని మాత్రం గుండెలనుండి తీసేసుకో లేదు. కాకపోతే కొద్దిగా కరుణ చూపిస్తోందంతే.

''ఏం చేసుకుంటావో నా కనవసరం –

రేపే వచ్చి తీసుకుపో — 'కడుపు సారెలు ఆ అదృష్టాలు మాకేడ్చాయి గనకనా ?'

మరీ కృంగిపోయింది జయమ్మ.

"తొమ్మిదో నెల పూర్తయ్యే టైముకు తీసుకెళ్తాములే వదినా. ఇప్పుడు నాతోపాటు దీన్నికూడా పోషించాలంటే వాడి శక్తికి మించిన పనయిపోతుంది."

"ఏం చెల్లెలికి నాలుగు రోజులు తిండి పెట్టలేని గతిలేని స్థితిలో వుండాడా నీ కొడుకు."

ఆమె ఎన్ని అడుగుతున్నా జయమ్మ సహనాన్ని కోల్పోవడంలేదు. కారణం ఆమె ఆడపిల్ల తల్లి — కన్నబిడ్డ కాన్పు చేయలేని నిస్సహాయ స్థితిలో వున్న స్త్రీ తను. అప్పు యిచ్చిన వ్యక్తి నిలదీస్తుంటే అప్పు తీసుకున్న తను తీర్చలేని స్థితిలో నిస్సహాయంగా నిల్చున్నట్టు నిల్చోనుందామె.

'నిజమే మరి. ఆడపిల్ల మొదటి కాన్పు పుట్టింటోళ్ళే చేయాలి' మరొక్కసారి మనసులోనే మననం చేసుకుని నిట్టూర్చింది.

* * *

"దాని అత్తగారు ఇలా అంటున్నారురా నన్నేం చేయమంటావు ?" అంటున్న తల్లికి —

"మీరంతా నా నెత్తినెక్కి ఊరేగండి" అని విసుక్కున్నాడు జయమ్మ కొడుకు రాఘవయ్య.

అతని విసుగులోనూ అర్థముంది. అతని పరిస్థితి అలాటిది. అప్పులివ్వాల్సిన వాళ్ళంతా ఇచ్చేసారు. అప్పు ఇవ్వడానికి ఇంకెవ్వరూ మిగల లేదు. అతను చేసేది గుడ్డలంగడిలో గుమస్తా ఉద్యోగం. జీతం రెండొందలు—పచ్చడిమెతుకులు ఒక పూట తిన్నా అది చాలడంలేదు. వున్న అప్పు తీర్చని అతనికి ఇంకా అప్పులిచ్చే నాధుడు లేడు.

తనకు తెలిసిన ప్రతి ఒక్కరి కాళ్ళా పట్టుకుంది జయమ్మ — ఎవ్వరూ దయ చూపలేదు. గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకెళ్ళమని సలహా ఇచ్చారు.

డాక్టరుగారు బిడ్డ అడ్డంగా వుంది అని చెప్పినప్పటినుండీ ఆలోచిస్తోంది జయమ్మ. ఎలా. ఎలా ? ఎంతలేదన్నా ఆపరేషన్ అంటే ఎనిమిదొందలన్నా అవుతుంది. పోనీ గవర్నమెంటు హాస్పిటల్‌కు తీసుకెళ్ళమని సలహాకూడా ఇచ్చింది డాక్టరమ్మ. గవర్నమెంటు ఆస్పత్రి అంటేనే తనకు భయం. తన భర్త చచ్చిపోయింది అక్కడ కాదూ !

ఆరోజు ఇంటికొస్తూనే ఒక నిర్ణయాని కొచ్చింది. ఇంకా పది రోజులుంది నెలలు నిండను. ఎవరింట్లోనైనా పాచిపనికి కుదిరితే— తిండి, గుడ్డ అవసరంలేదని చెప్తే నెలకు వంద రూపాయిలిస్తారు. తనింట్లో పనిచేసే మనిషి బిడ్డకు ఆపరేషన్ అంటే జాలిపడి సహాయం చేయకపోతారా ?

కానీ జయమ్మ ఆలోచన ఆదిలోనే అబద్ధమని తేలిపోయింది.

ఆ పల్లెటూరిలో వున్న నాలుగు పెద్దిళ్ళ వాళ్ళూ తిరస్కరించారు.

మధ్య తరగతి కుటుంబంలో వాళ్ళను పనికి పెట్టుకుంటే వాళ్లను ఒక మాట అనడానికి లేదు. పైగా కూతురు కాన్పుకు ఏదో అడక్క పోదు. ఎందుకొచ్చిన తద్దినం అనుకుని మర్యాదగా అవసరం లేదని చెప్పేసారు.

ఆ తర్వాత ఇంకేం చేయాలో తోచని నిరోమయ స్థితిలోస్తబ్దుగా వారం రోజులు గడిపే సింది. ఈ వారం రోజులు తన బిడ్డ అక్కడ ఎన్ని ఆరళ్ళు పడుతోందో అని అప్పుడప్పుడు గుండెను మండించుకుంటోంది. ఆ మంట ఇంకెన్ని రోజులో తల్లికివ్వదల్చుకోనట్టు పురిటినొప్పులతో పుట్టింటి కొచ్చింది మల్లీశ్వరి.

"ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకపోవాల" అనుకున్నప్పుడల్లా కొన్ని పచ్చనోట్ల వెలితి కళ్ల ముందు కన్పించేది. గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకెళ్లాలనుకుంటే— చచ్చిపోయిన తన భర్త గుర్తుకొచ్చేవాడు.

మల్లీశ్వరి నొప్పుల కేకలతో ఇల్లు ప్రతి ధ్వనిస్తుండగా ఏ ఆలోచనా తెగక పన్నెండు గంటలు గడిచిపోయాయి.

ఆఖరున చెల్లెలు కళ్ళు తేలవేసేసరికి, చెల్లెలి ఒళ్ళు చల్లబడేసరికి స్పృహ తెచ్చుకున్న రాఘవయ్య తల్లిని కాదని బస్సులో గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకొచ్చాడు.

* * *

'గర్భసంచి పగిలిపోయింది. ఆపరేషన్ చేయాలి. బిడ్డ బ్రతకదు!' పరీక్షచేసి చెప్పింది డాక్టరు కరుణ.

"అలాగే మీ ఇష్టం. బిడ్డ పోయినా ఫరవాలేదు. మా చెల్లెల్ని బ్రతికించండి. మీకు ఏమీ ఇచ్చుకోలేని బీద స్థితిలో వున్నాను. మీ కెంతో ఋణపడి వుంటాను."

కళ్ళెత్తి ఒక్క క్షణం చూసి—

"ఇది గవర్నమెంటు హాస్పిటల్. మా శ్రమకు జీతం గవర్నమెంటు ఇస్తుంది." అనే థియేటర్ రెడీ చేసుకోవడంలో పడిపోయిందామె

కానీ ఆపరేషన్ చేసే శ్రమ మల్లీశ్వ ఆమె కివ్వలేదు. వచ్చిన పదినిమ్మిషాల్లో ఆమె గుండె చలనం ఆగిపోయింది.

* * *

"ఇది చాలా ఘోరం. మీ అత్తగారికి డబ్బుంది కదా ! అంత దయలేకుండా ఎలా ప్రవర్తించింది ?" అంది మల్లీశ్వరి తోడికోడలు నోటివెంట తన పేషెంటు కథ విన్న డాక్టరు కరుణ కోపంగా.

"ఆడపిల్ల మొదటి కాన్పు పుట్టింటోళ్ళు చేయాలి కదండీ."

చాలా అసహ్యమేసింది కరుణకు. ఆ అసహ్యం మల్లీశ్వరి తోడికోడలుమీద కాదు. ఆమె మౌఢ్యంమీద — ఆమెలాటి కొన్ని కోట్లమంది ఆచారాల మైకంమీద.

వీళ్ళ యింట్లో ఓ ఆడపిల్ల దయనీయ మైన మృతికూడా వీళ్ళ ఆచారాల మైకాన్ని దింపలేదా ? మన ఆచారాలు మనకింత విషాదాన్ని అందిస్తుంటే అదే ఆచారాలకు ఎంత ఘనమైన స్వాగతం పలుకుతున్నాం మనం ! ★

